క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: బాచుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ల నిర్వహణ నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు రెయిన్‌బో కాలనీ, ఐడీపీఎల్ కాలనీ, వీఎన్ఆర్ కళాశాల, జీపీఆర్ లేఅవుట్, ప్రణీత్‌ప్రణవ్, ప్రణీత్ జెనీత్, కేఆర్‌సీఆర్ కాలనీ, క్రాంతినగర్, ఆర్టీసీ కాలనీ, ఇందిరనగర్, శ్రీహోమ్స్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఎలీప్ సబ్‌స్టేషన్ పరిధిలో...

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో ఆటంకాలు ఏర్పడనున్నాయని ప్రగతినగర్ సబ్‌స్టేషన్ ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. 33/11 కేవీ ఎలీప్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ప్రగతినగర్ గ్రామం, ఎలీప్ ఇండస్ట్రీ ఏరియా, ఇన్‌కాయిస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు ఇది గమనించాలన్నారు.

శుభాకాంక్షలు



కుత్బుల్లాపూర్: మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి పుట్టిన వేడుకలు ఘనంగా జరిగాయి. జీడిమెట్ల డివిజన్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో జరిగిన వేడుకలకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా భరతసింహారెడ్డిని శాలువలతో సత్కరించి ఆయనతో కేక్‌లు కట్ చేయించారు.

వారానికి రెండు సార్లు ఫాగింగ్ చేయండి

జీడిమెట్ల: దోమల నివారణకు ఎంటమాలజీ సిబ్బంది ఫాగింగ్ చేయాలని సుభాష్‌నగర్ కాలనీవాసులు కోరుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా దోమలు కుడుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా ఎంటమాలజీ డిపార్ట్‌మెంట్ అధికారులు పట్టించుకుని సుభాష్‌నగర్ కాలనీలో కనీసం వారానికి రెండు సార్లయినా ఫాగింగ్ చేయాలని కోరుతున్నారు.

వీధి కుక్కలను తరలించండి



చిన్నారి వైద్యం కోసం రూ.10వేల ఆర్థిక సాయం అందజేస్తున్న జెమ్మి దేవేందర్

కుత్బుల్లాపూర్: మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కల బెడద పెరిగిపోయిందని.. వాటిని కట్టడి చేయడంతో కొంపల్లి మున్సిపల్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని బీఆర్ఎస్ నాయకుడు జెమ్మి దేవేందర్ అన్నారు. ఇటీవల కొంపల్లి మున్సిపాలిటీ 4వ వార్డులోని మొగుళ్ల కుంటలో వీధి కుక్కలు దాడి చేయడంతో తనుశ్రీ అనే చిన్నారి తీవ్రంగా గాయపడింది. ఈ విషయం తెలుసుకున్న దేవేందర్ సోమవారం బాలిక వైద్య చికిత్స నిమిత్తం తన వంతు సహాయంగా రూ.10వేలను బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధి కుక్కలను తరలించడంతోపాటు కూ.ని. ఆపరేషన్‌లు చేయించాలని కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన సంక్షేమ సంఘాలు ప్రతినిధులు

రంగారెడ్డినగర్: సంక్రాంతి, కనుమ పండుగను పురస్కరించుకుని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానందను పలువురు సంక్షేమ సంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా పలు కాలనీలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంక్షేమ సంఘాలు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు.. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పేట్‌బషీరాబాద్ దండమూడి ఎంక్లేవ్ ఆయన నివాసంలో వచ్చిన వారిని కలుస్తూ పలు సమస్యలను అడిగి తెలుసుకుని ఎమ్మెల్యే అధికారులతో ఫోన్లలో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు.

మాజీ ఎమ్మెల్యేకు పండగ శుభాకాంక్షలు

రంగారెడ్డినగర్: కనుమ పండుగను పురస్కరించుకుని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను సోమవారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో పలువురు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఓక్షిత్ ఎన్‌క్లేవ్ సంక్షేమ సంఘం ప్రతినిధులు గోపాల్‌రెడ్డి, యాదయ్య, జగద్గిరిగుట్ట బీజేపీ నాయకులు అరుణ్, హనుమాన్‌చారి, సాంబయ్య, పరశురామ్ లతో పాటు పలువురు మహిళలు శ్రీశైలంగౌడ్‌ను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రారంభించి ఏడాది... ఇంకా అందుబాటులోకి రాదేంటి.?

అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా మారింది చింతల్ డివిజన్ వాసుల పరిస్థితి. చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో సుమారు రూ.4కోట్లతో నిర్మించిన మోడ్రన్ ఫంక్షన్‌హాల్ హంగు ఆర్భాటాలతో మంత్రి కేటీఆర్ ప్రారంభించి ఏడాది కావస్తున్నా నేటికి ప్రజలకు అందుబాటులోకి రాలేదు. చేసేది లేక స్థానికులు ప్రైవేట్ ఫంక్షన్‌హాళ్లను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఆర్థిక భారం మరింత పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



భగత్‌సింగ్‌నగర్‌లోని మోడల్ ఫంక్షన్‌హాల్ భవనం

చింతల్: డివిజన్‌లో నివసిస్తున్న పేదల కుటుంబాల్లో వివాహల ఖర్చులో ప్రభుత్వం కొంతైనా ఆర్థిక భారం నుంచి గట్టెక్కించాలన్న ఉద్దేశంతో 2015–16లో సుమారు రూ.2 కోట్లతో మోడ్రన్ కల్యాణ పండపానికి శంకుస్థాపన చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఖర్చులు భరించలేక, మామూళ్లు పంచలేక, నిధులు చాలవన్న సాకుతో మధ్యలోనే వదిలేసి పత్తాలేకుండా పోయాడు.

◆ దీంతో అధికారులు మరో కాంట్రాక్టర్‌కు అప్పగించినా ప్రయోజనం లేకపోవడంతో మరో ఇద్దరు కాంట్రాక్టర్లు భవనాన్ని పూర్తి చేసి ఎట్టకేలకు మంత్రి కేటీఆర్‌తో 25 జనవరి 2022న ప్రారంభించి మరో 15 రోజుల్లో అందుబాటులోకి వచ్చేలా చూడాలంటూ వెళ్లిపోయారు. కొన్నిరోజులైతే ఏడాది పూర్తవుతుంది. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వీడకపోవడంతో పేద ప్రజలకు శాపంగా పరిణమించింది.

అంచనాలు దాటిపోయిన నిధుల వినియోగం..

2015–16లో భగత్‌సింగ్‌నగర్‌లో నిర్మించిన మోడ్రన్ ఫంక్షన్‌హాల్ నిర్మాణ పనులకు రూ.2కోట్లతో శంకుస్థాపన చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా రెండేళ్లలో పూర్తి కావాల్సిన నిర్మాణం ఆరేళ్లు పూర్తయ్యే సరికి రూ.3 కోట్ల 58 లక్షల 32వేల నిధులు ఖర్చు పెట్టినట్లు అధికారులు, ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు. కాగా 25 జనవరి 2022న మంత్రి కేటీఆర్ హాజరై ఆఘమేఘాల మీద వచ్చి ఫంక్షన్‌హాల్ భవనాన్ని ప్రారంభించారు. కానీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఫంక్షన్‌హాల్‌కు వచ్చే వారికి భోజన సదుపాయాల కోసం, కిచెన్, డైనింగ్ హాల్, మూత్రశాలలు నిర్మాణం చేపట్టకుండానే ప్రారంభించడం గమనార్హం.

నిధులు దుర్వినియోగం..

మంత్రి కేటీఆర్ ప్రారంభించిన భగత్‌సింగ్‌నగర్ మోడ్రన్ ఫంక్షన్‌హాల్‌కు ఓపెన్ కిచెన్, డైనింగ్‌హాల్, టాయిలెట్ల నిర్మాణం, ప్రత్యేక నిధులు కేటాయించి నిర్మాణం చేపట్టారు. అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు అందుబాటులోకి రాలేదు.

ప్రణాళిక లేని నిర్మాణాలు..

మంత్రి కేటీఆర్ ప్రారంభించిన తరువాత రూ.20 లక్షలతో మోడ్రన్ కిచెన్, డైనింగ్ హాల్, టాయిలెట్ల నిర్మాణ అనంతరం మరో రూ.30లక్షలు కేటాయించి మోడ్రన్ ఫంక్షన్‌హాల్ ప్రహరీ నిర్మాణం ఎత్తు పెంచేందుకు కేటాయించినట్లు తెలుస్తోంది. మంత్రి కేటీఆర్ ప్రారంభించే నాటికి ప్రహరీ నిర్మాణం చేపట్టినా మరిన్ని నిధులు వెచ్చించి ప్రహరీ ఎత్తు పెంచడంపై తీవ్ర విమర్శలు వినిపించాయి. ఆ సమయంలోనే ఈ ప్రహరీ గోడ కనిపించ లేదా అంటూ బస్తీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం ప్రజాప్రతినిధులు, అధికారుల కోసమో ప్రహరీ ఎత్తు నిర్మాణ కార్యక్రమాలు చేసినట్లు ఆరోపణలు వినిపించాయి.

◆ కాగా ఈ ప్రహరీ నిర్మాణం పనులు నాసిరకంగా చేపట్టినా అధికారులు, ప్రజాప్రతినిధులు చూసీచూడనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. నిర్మాణంలో భాగంగా సదరు కాంట్రాక్టర్ గోడలకు ఒక్క చుక్క నీరు పోయకుండా పనులు పూర్తి చేస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కాగా మరో కొన్ని రోజులు గడిస్తే మంత్రి కేటీఆర్ ప్రారంభించి ఏడాది పూర్తవుతుంది. అప్పటికి ఈ భగత్‌సింగ్ నగర్ మోడ్రన్ ఫంక్షన్‌హాల్ ప్రజలకు అందుబాటులోకి వస్తుందో.. లేదో.. వేచి చూడాల్సిందే.



క్యూరింగ్ చేయకుండా వదిలేసిన మోడల్ ఫంక్షన్‌హాలు ప్రహరీ



మంత్రి కేటీఆర్ ప్రారంభించిన మోడ్రన్ ఫంక్షన్‌హాల్ శిలాఫలకం

100రోజులు.. కంటి వెలుగు శిబిరాలు

- జంట సర్కిళ్లలోని 16 ప్రాంతాల్లో శిబిరాలు
- ప్రతిరోజు 3వేల మందికి కంటి పరీక్షలు



కంటి వెలుగు శిబిరాలను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ మమత, అధికారులు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ గాజులరామారం జంట సర్కిల్ పరిధిలో గురువారం నుంచి 100 రోజుల పాటు కంటి వెలుగు శిబిరాలు నిర్వహించేందుకు ఒక్కో డివిజన్లో ఒక్కో ప్రాంతాన్ని ఎంపిక చేశారు.. మొత్తం తొమ్మిది శిబిరాలను ఏర్పాటు చేసి అన్ని రకాల కంటి పరీక్షలను నిర్వహించేందుకు సిద్ధం చేశారు. ఇప్పటికే కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత ఆయా ప్రాంతాల్లో సెంటర్లను తనిఖీలు చేసి తగు ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు.

టార్గెట్ వారీగా...

జంట సర్కిళ్ల పరిధిలో మొత్తం 16 చోట్ల కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహిస్తున్నామని కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ మంగతాయారు తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 10 లక్షల పైగానే జనం ఉండగా ఇప్పటికే ఆయా వైద్య విభాగం అధికారులు కంటి సమస్యతో బాధపడుతున్న వారి వివరాలను తీసుకుని జాబితా రూపొందించారు. ప్రతిరోజు 3000 పైగా మందికి పరీక్షలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

ప్రాజెక్టు అధికారుల పర్యవేక్షణలో...

మహిళా సంఘాల బాధ్యతలు చేపట్టే ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్, హరిప్రియ పర్యవేక్షణలో ఒక కంటి వైద్య నిపుణుడు, వైద్య ఆరోగ్య అధికారి, ఇతర సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లతో ఒక్కో శిబిరంలో ఉండే విధంగా ప్లాన్ రూపొందించారు. కంటి పరీక్షలు పూర్తయిన తర్వాత అవసరం అయిన వారికి కంటి అద్దాలు అందజేసే విధంగా శాస్త్ర చికిత్సలు అవసరం ఉన్నవారికి ఉచితంగా వారికి సేవలు అందించే దిశగా అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు.

వైద్య శిబిరాలు ఇవే...

ఈనెల 19 నుంచి ప్రారంభమయ్యే వైద్య శిబిరాలను అధికారులు ప్రకటించారు. గాజులరామారం డివిజన్ పరిధిలోని బతుకమ్మ బండ కమ్యూనిటీహాల్, జగద్గిరిగుట్ట డివిజన్‌లో మగ్దూమ్ నగర్ నగర్‌సాయిబాబా కళ్యాణ మండపం, చింతల్ డివిజన్‌లో భగత్‌సింగ్‌నగర్ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్, సూరారం డివిజన్‌లో శివాలయనగర్ అంబేడ్కర్ భవనం, రంగారెడ్డినగర్ డివిజన్‌లో గాంధీ నగర్ కమ్యూనిటీహాల్, సుభాష్‌నగర్ డివిజన్‌లో లూయిస్ బ్రెయిలీ కమ్యూనిటీహాల్, సుభాష్‌నగర్ జీనియస్ హైస్కూల్, కుత్బుల్లాపూర్ డివిజన్‌లో పద్మానగర్ ఫేస్–2 కమ్యూనిటీహాల్, జీడిమెట్ల డివిజన్‌లో దుర్గా ఎస్టేట్ కమ్యూనిటీహాల్ ఇందుకు వేదికలు కానున్నాయి.

కల్యాణం.. కమనీయం



గోదారంగనాథస్వామి కల్యాణంలో పాల్గొన్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట్: నిజాంపేట్‌లోని శ్రీఅభయాంజనేయ స్వామి దేవాలయంలో సోమవారం గోదారంగనాథ స్వామి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు శ్రీరామ పంతులు ఆయన్ని శాలువతో సత్కరించి ఆశీర్వచనాలు అందజేశారు. దంపతులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవాన్ని కనురాల వీక్షించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నదానం నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్పొరేటర్లు మేకల వెంకటేష్, రాజేశ్వరి, మాజీ సర్పంచ్ వడ్ల నగేష్‌చారి, ఆలయ కమిటీ సభ్యులు రాజ్‌మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రవీణ్, తల్లారి సాయిముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ స్మార్ట్ సిటీ బృందం



బెస్ట్ టెక్ అవార్డు సాధించినది వీరే..

రాయదుర్గం: ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ స్మార్ట్ సిటీ బృందం సత్తా చాటింది. 2023 సంవత్సరంలో మొదటి అంతర్జాతీయ అవార్డును పొందడం విశేషం. ఓపెన్ సోర్స్ వన్ ఎం2ఎం ప్లాట్‌ఫామ్‌లలో ఒకదానిని ఉపయోగించి పరిష్కారాలను ప్రోత్సహించడం వార్షిక హ్యాకథాన్ లక్ష్యం. దక్షిణ కొరియాలోని సైన్స్ ఐసీటీ మంత్రిత్వ శాఖతో పాటు టెలికమ్యూనికేషన్స్ టెక్నాలజీ అసోసియేషన్ (టీటీఏ), యూరోపియన్ టెలికమ్యూనికేషన్స్ స్టాండర్డ్స్ ఇన్‌స్టిట్యూట్(ఈటీఎస్ఐ) సహకారంతో కొరియన్ ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్(కెఈటీఐ) నిర్వహించిన 8 వారాల అంతర్జాతీయ ఆన్‌లైన్ హ్యాకథాన్ ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్ స్ట్రీట్ లైట్ ఆటోమేషన్ ప్రాజెక్టు టెలికమ్యూనికేషన్స్ విభాగంలో బెస్ట్ టెక్నాలజీ అవార్డును సాధించింది. 'టీమ్ ఎథీనా' విన్నింగ్ ప్రాజెక్టు మొత్తం 12 విశ్వవిద్యాలయ బృందాలు హ్యాకథాన్‌లో పాల్గొన్నాయి. వాటిలో రెండు ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లోని స్మార్ట్ సిటీ లివింగ్ ల్యాబ్‌కు చెందినవి కావడం విశేషం. వైభవ్ నవేర్ ఆధ్వర్యంలో ఎథీనా బృందంలో ప్రశాంత్ నందిపాటి, రాకేష్ హోట్కర్, సుధాకొల్లిమర్ల ఉన్నారు.

మారుమూల ప్రజలకు సాంకేతికతను చేర్చాలి

రాయదుర్గం: మనదేశంలోని మారుమూల ప్రజలకు సాంకేతికతను మరింతగా చేర్చాల్సిన అవసరం ఉందని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బీజేరావు అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లో సోమవారం నుంచి 22వ తేదీ వరకు డీఎస్‌టీ–ఎస్‌టీయూటీఐ ఆధ్వర్యంలో సాగే 'బయో మెడికల్ రీసెర్చ్‌లో అధునాతన పద్ధతులు' అనే అంశంపై నిర్వహించే వర్క్‌షాప్‌లో ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరికీ చేరువలోకి ప్రతి పరిశోధనా అంశాన్ని చేరేలా చేయాల్సిన అవసరం కూడా ఉందన్నారు. వర్క్‌షాప్‌ల నిర్వహణతోపాటు ఇందులోని అంశాలను ప్రజలకు కూడా చేరేలా చేయాలన్నారు. 'పాపులేషన్ జెనోమిక్స్ అండ్ పబ్లిక్ హెల్త్' అనే అంశంపై డాక్టర్ కె తంగరాజ్ మాట్లాడుతూ.. భారతదేశంలోని మానవ జనాభా చరిత్రపై అంతర్‌దృష్టులను అందించారు. సైన్స్ అండ్ మెజర్మెంట్స్–ప్రయోగాత్మక రూపకల్పన అనే అంశంపై విశిష్ట జీవశాస్త్రవేత్త ప్రొఫెసర్ కె మురళీధర్, 'ప్రస్తుత ఎన్‌జీఎస్ ఆధారిత పరీక్షలకు దారితీసే జన్యు పరీక్షల పరిణామం' అనే అంశంపై కామినేని మెడికల్ కాలేజి జెనెటిక్స్ అండ్ మాలిక్యూలర్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ క్యా అన్నీ హసన్ ప్రసంగించారు. అనంతరం ప్రొఫెసర్ సుహెల్‌పర్వేజ్, వర్క్‌షాప్ కన్వీనర్ ప్రొఫెసర్ పి ప్రకాశ్‌బాబు, కో కన్వీనర్లు ప్రొఫెసర్ సంతోష్ ఆర్ కన్నాడే, డాక్టర్ ఎంకె అనుణశ్రీ, డాక్టర్ సంతోష్‌కుమార్‌పాధి ప్రసంగించారు.

23 నుంచి 'మనూ'లో అంతర్జాతీయ సెమినార్

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ ఉర్దూ కల్చర్ స్టడీస్(సీయూసీఎస్), ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్ విద్యామంత్రిత్వశాఖ సంయుక్త ఆధ్వర్యంలో డెక్కన్ సూఫీల మూడు రోజుల అంతర్జాతీయ సెమినార్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జనవరి 23 నుంచి 25వ తేదీ వరకు మత సామరస్య ప్రమోషన్ కోసం సూఫీల సహకారంపై ఈ సెమినార్‌ను నిర్వహిస్తారు. క్యాంపస్‌లోని సయ్యద్ హమీద్ లైబ్రేరీ ఆడిటోరియంలో ఉదయం 10.30 గంటలకు ఈ సెమినార్‌ను వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ అధ్యక్షతన నిర్వహిస్తారు. గౌరవ అతిథిగా ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ కాన్సుల్ జనరల్ అకై మహదీ షారోఖీ, హైదరాబాద్‌లోని హెన్రీ మార్టిన్ ఇన్‌స్టిట్యూట్ రెవరెండ్ డాక్టర్ ప్యాకియం టి శామ్యూల్, సీయూసీఎస్, సెమినార్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్ఎం అజీజుద్దీన్‌హుస్సేన్, సెమినార్ కన్వీనర్ డాక్టర్ అహ్మద్‌ఖాన్ పాల్గొంటారు.

30న భ్రమరాంభ మల్లికార్జున స్వామి కల్యాణం

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేట్‌లోని శ్రీభ్రమరాంభ మల్లికార్జునస్వామి కల్యాణం ఈనెల 30న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. 29న సాయంత్రం 4గంటలకు స్వామి, అమ్మవార్లను గంగకు తీసుకువెళ్లుట, 30న మధ్యాహ్నం 3గంటలకు స్వామివారి కల్యాణం, బోనాల ఊరేగింపు, గొలుసు తెంపుట, అగ్నిగుండం దాటుట, రాత్రి 8 గంటల నుంచి తెల్లవారుజాము వరకు కళాకారులతో ఒగ్గు కథ, 31వ తేదీ ఉదయం నాగవెళ్లి తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొంది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి అమ్మవార్ల దీవెనలు పొందాలని ఆలయ కమిటీ కోరింది.

మేడ్చల్ జిల్లాలో 27.51 లక్షల మందికి కంటి పరీక్షలు

- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి హరీష్‌తో కలెక్టర్ హరీష్

సాక్షి,మేడ్చల్ జిల్లా: కంటివెలుగు రెండో విడతలో భాగంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 27,51,810 మందిని గుర్తించామని, వారిందరికీ కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ హరీష్ తెలిపారు. కంటి పరీక్షల నిర్వహణకు సంబంధించి 480 ప్రాంతాల్లో 79 బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర మంత్రి హరీష్ రావు, సీఎస్ శాంతికుమారి, డీజీపీ అంజన్‌కుమార్, హెల్త్ కమిషనర్ శ్వేతలతో ఆయన మాట్లాడారు. కంటి వెలుగుకు సంబంధించి ముందస్తు ప్రణాళికను తయారు చేసి ఎక్కడ శిబిరాన్ని నిర్వహిస్తున్నారనే సమాచారాన్ని ఒకరోజు ముందుగానే ప్రజలకు తెలిసేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. కంటి వెలుగు విషయంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, మాస్ మీడియా అధికారి వేణుగోపాల్‌రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పూర్వవైభవానికి సమష్టిగా పని చేయాలి



కాంగ్రెస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిధి హన్మంతరెడ్డి

చింతల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని టీపీసీసీ అధికార ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. చింతల్ డివిజన్ వల్లభాయ్‌పటేల్‌నగర్‌లో సోమవారం కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఎగురవేశారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ... చింతల్ డివిజన్‌లో 39 బూత్‌స్థాయి కమిటీలను పూర్తి చేసి ఇంటింటి ప్రచారం చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా కుత్బుల్లాపూర్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, నారాయణరెడ్డి, పండరి, జేమ్స్, లక్ష్మయ్య, నరేష్, మహేష్, లలిత, సరిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో కమ్యూనిటీతో కలిసి పోలీసుల రాత్రి గస్తీ



స్థానిక యువతతో కలిసి సైకిళ్లపై గస్తీని నిర్వహిస్తున్న దృశ్యం

రాయదుర్గం: కాలనీలు, బస్తీల్లో దొంగతనాలు చోటు చేసుకోకుండా కమ్యూనిటీని భాగస్వాములు చేయడానికి పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం రాత్రి రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని మధురానగర్, గచ్చిబౌలి, టెలికామ్‌నగర్, ఖాజాగూడ, జయభేరి పైన్‌వ్యాలీ, ప్రశాంత్‌హిల్స్, ల్యాంకో హిల్స్ రోడ్, మణికొండ, పంచవటికాలనీ, హనుమాన్‌నగర్, గంగోత్రి స్కూల్ లేన్, చిత్రపురిహిల్స్, టింబర్‌లేక్‌కాలనీవంటి ప్రాంతాల్లో పోలీసుల రాత్రి గస్తీని సైకిళ్లపై తిరుగుతూ పోలీసులు, స్థానికులు పర్యటించారు. మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి నాయకత్వం, రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ ఎం. మహేష్ ఆధ్వర్యంలో పోలీసులు, కమ్యూనిటీ వలంటీర్లతో కలిసి సైక్లింగ్‌ను నిర్వహించారు. సైకిళ్లపై పెట్రోలింగ్ కార్యక్రమాన్ని గచ్చిబౌలి డివిజన్‌లోని లేక్‌కాలనీ, మధురానగర్ ప్రాంతాల్లో అర్ధరాత్రి అనుమానాస్పదంగా సంచరిచే అనుమానితులను గుర్తించి వాహనాన్ని తనిఖీ చేసి, ఆస్తి అక్రమాలను అరికట్టేందుకు సంక్రాంతి పండుగ సమయం దృష్ట్యా పెట్రోలింగ్‌ను నిర్వహించారు. ఈ సైకిల్‌పై పెట్రోలింగ్ కార్యక్రమంలో కమ్యూనిటీ నుంచి జనార్ధన్, ప్రతాప్, చైతన్య, వంశీ, తేజేంద్ర, మంజునాథ్, మహేష్, సందీప్, శ్రీచరణ్, అనిమేష్ సైకిల్‌పై పెట్రోలింగ్‌లో పోలీసులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి మాట్లాడుతూ.. సైక్లింగ్ కమ్యూనిటీ పోలీసులతో కలిసి హైదరాబాద్ నగరంలో అద్భుతాలు చేయగలమని పోలీసులు నిరూపించారన్నారు.

ముక్కు మూసుకోవాల్సిందే..



రాంరెడ్డినగర్‌లో రోడ్డుపై పారుతున్న మురుగు

జీడిమెట్ల: సుభాష్‌నగర్ డివిజన్ రాంరెడ్డినగర్‌లో భూగర్భడ్రైనేజీ అవుట్‌లెట్‌లు సరిగా లేకపోవడంతో మురుగు రోడ్లపై పారుతుంది. ప్రతిరోజు రోడ్ల గుండా రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు. ముక్కులు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని స్థానికులు పేర్కొంటున్నారు. సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల కొత్తగా భూగర్భడ్రైనేజీ పైప్‌లైన్ సామర్థ్యం పెంచాల్సి ఉందని.. మరికొన్ని చోట్ల అవుట్‌లెట్‌లకు మరమ్మతులు నిర్వహించాల్సి ఉందని అధికారులు సర్వే చేసి తెలిపారు. కాని పనులు మాత్రం ప్రారంభించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

ప్రజావాణిలో 25 ఫిర్యాదులు



సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చే వినతులు, దరఖాస్తులను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులు సత్వరమే వాటిని పరిష్కరించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణి హాలులో జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్‌తో కలిసి ప్రజల నుంచి వచ్చిన 25 దరఖాస్తులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు అక్కడికక్కడే పరిష్కరించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాల్సిందే..



రోడ్డు పక్కల వ్యర్థాలకు నిప్పుపెట్టిన దృశ్యం

జీడిమెట్ల: రోడ్లపై పారిశ్రామిక వ్యర్థాలను పారబోస్తూ నిప్పుపెడుతున్న వారిపై ఐలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. జీడిమెట్ల ఫేజ్–2 నుంచి ఏస్వీ కో–ఆపరేటివ్ సొసైటీకి వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపుల గుర్తు తెలియని వ్యక్తులు పరిశ్రమల్లో వెలువడే చెత్తను డంప్ చేస్తున్నారు. అనంతరం వ్యర్థాలకు నిప్పుపెడుతుండటంతో సమీపంలో ఉన్న సుభాష్‌నగర్ కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఘాటైన పొగలు వెలువడుతుండటంతో కళ్లల్లో మంటలు వస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ విషయమై ఐలా అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త డంప్ చేసే ప్రదేశంలో అధికారులు సీసీ కెమరాలు ఏర్పాటు చేసి చెత్త డంప్ చేసే వారిని గుర్తించి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.